31వ వసంతంలోకి
చురకలు
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా
గురువారం, నవంబర్ 19 , 2026 పేజీలు : 8

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలి



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 18 : జిల్లా పరిధిలోని బ్యాంకులు వ్యవసాయ రంగానికి, దాని అనుబంధ రంగాల అభివృద్ధికి విరివిగా రుణాలు మంజూరు చేయాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ ప్రసునాంబ సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో బ్యాంకింగ్ రంగ సెప్టెంబర్ త్రైమాసిక సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ జిల్లా వార్షిక రుణ ప్రణాళికకు సంబంధించి ఇప్పటివరకు సాధించిన పురోగతిపై సమీక్షించారు. గ్రౌండింగ్ లో ఉన్న ఇబ్బందులను చర్చించి నిర్ణయించిన రుణ లక్ష్య సాధనకు బ్యాంకర్లు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్, ఆర్బీఐ ఎల్డీఓ యశ్వంత్ సాయి, నాబార్డ్ డిడిఎం దిలీప్ చంద్ర, యూబీఐ, ఎస్బీఐ రీజనల్, డిప్యూటీ రీజనల్ హెడ్లు, సంబంధిత శాఖల, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనులను
నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

-భక్తుల భద్రత, మౌలిక వసతులకు అత్యంత ప్రాధాన్యత కల్పించాలి
-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 18: ఆలయ పునర్నిర్మాణ, ఘాట్ల నిర్మాణ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, భక్తుల భద్రత, మౌలిక వసతులకు అత్యంత ప్రాధాన్యత కల్పించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. ధర్మపురి పట్టణంలోని ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు, రానున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని నిర్మిస్తున్న పుష్కర ఘాట్ల పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని కొనసాగుతున్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటిస్తూ, నిర్ణీత గడువులోగా నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గోదావరి నది పరివాహక ప్రాంతంలో నిర్మిస్తున్న పుష్కర ఘాట్ల పనులను పరిశీలించారు. ముఖ్యంగా న్యూ ఘాట్స్, రోడ్లు, హెలిప్యాడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మహాలక్ష్మి ఘాట్ నుంచి వీఐపీ ఘాట్ వరకు చేపడుతున్న రహదారులు, ఇతర మౌలిక వసతుల పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిరంతరం -మిగతా 2లో



విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు
నిర్దేశించుకోవాలి

చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 18: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం జగిత్యాల పట్టణంలోని పొన్నాల గార్డెన్స్ లో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని కష్టపడితేనే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలర న్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో వ్యక్తిత్వ వికాసం, లక్ష్య నిర్దేశం ఎంతో ముఖ్యమని, ఇలాంటి అవగాహన సదస్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ మాట్లాడుతూ పుస్తక పఠనం వల్లనే జ్ఞానంతో -మిగతా 2లో

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి
పకడ్బందీ ఏర్పాట్లు

-18 నుంచి 59 ఏళ్ల వారు అర్హులు
-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
-ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై అధికారులు, సిబ్బందికి ఐడీఓసీలో శిక్షణ



చురుకలు ప్రతినిధి రాజన్న సిరిసిల్ల, నవంబర్ 18 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇందిర మ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై జిల్లాలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల పంచాయతీ అధికారులు, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు, పంచాయతీ సెక్రెటరీలు ఇతర అధికా రులకు సిబ్బందికి జిల్లా సమీకృత కార్యా లయం ఆడిటోరియంలో బుధవారం ప్రొజెక్టర్ ద్వారా శిక్షణ ఇచ్చారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 18 నుంచి 59 ఏళ్ల వయసున్న వారికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నదని -మిగతా 2లో

దళిత బంధు లబ్ధిదారులకు.. కొత్త పథకాల తిప్పలు



చురకలు ప్రతినిధి హుజూరాబాద్ నవంబర్ 18 : గత ప్రభుత్వ హయాం లో 'దళిత బంధు' పథకం కింద ఆర్థిక సాయం పొందిన లబ్ధిదారులకు ప్రస్తుతం కొత్త సంక్షేమ పథకాలు అందని ద్రాక్షలా మారాయి. నిబంధనల కారణంగా వారికి కొత్తగా ఇస్తున్న పెన్షన్లు, ఇందిరమ్మ ఇం డ్లు మంజూరు కావడం లేదన్న ప్రచారం జరుగుతుండటంతో లబ్ధిదారుల కుటుం బాల్లో ఆందోళన నెలకొంది.గతంలో కేసీఆర్ ప్రభుత్వం హుజూరాబాద్ కేంద్రంగా దళిత బంధు పథకాన్ని ప్రారంభించి, అర్హులైన ఒక్కో కుటుంబానికి రూ. 10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించింది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే హుజూరాబాద్ నియోజకవర్గంలోనే అత్యధిక మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు.

అడ్డంకిగా మారిన నిబంధనలు:

ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఒంటరి మహిళలు, వితంతువులకు కొత్తగా పెన్షన్ల మంజూరు ప్రక్రియను చేపట్టింది. దీంతో పాటు నిరుపేదలకు 'ఇందిరమ్మ ఇండ్ల' పథకం కింద రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. అయితే, ఏదైనా ఒక ప్రభుత్వ పథకంలో లబ్ధి పొందిన వారికి ఐదేళ్ల వరకు మరో పథకంలో అవకాశం ఇవ్వకూడదనే నిబంధన ఉందని అధికారులు చెబుతున్నారు. దీనివల్ల దళిత బంధు పొందిన కుటుంబాలు ఈ కొత్త పథకాలకు అనర్హులవుతున్నారనే చర్చ జోరుగా సాగుతోంది.

హోల్డ్‌లో దరఖాస్తులు.. లబ్ధిదారుల ఆవేదన:

అన్ని అర్హతలు ఉన్నప్పటికీ, గతంలో దళిత బంధు తీసుకున్నారనే కారణంతో తమ పేర్లను పరిగణనలోకి తీసుకోవడం లేదని స్థానిక -మిగతా 2లో

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

-అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం
-త్వరలో అర్హులందరికీ చేయూత పెన్షన్లు
-జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 18 : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని,అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల పట్టణంలోని దేవిశ్రీ గార్డెన్ లో 969 మంది లబ్ధిదారులకు నూతన చేయూత పెన్షన్ల మంజూరు పత్రాలను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత నేత కార్మికులు, ఫైలేరియా బాధితులకు చేయూత పెన్షన్లు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయన్నారు. అతి త్వరలో అర్హులందరికీ చేయూత పెన్షన్లు మంజూరుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి సొంతింటి కల సాకారం చేస్తామన్నారు. గుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణ ఉండాలన్నదే ముఖ్యమంత్రి ఉద్దేశమని, గుడిసెల్లో ఉన్నవారికి తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. సామాజిక న్యాయం పాటిస్తూ అన్ని వర్గాలకు ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. 5 లక్షల ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ఇందిరమ్మ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ప్రకటిస్తారన్నారు. అర్బన్ హౌసింగ్ కాలనీలో డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని, ప్రజలు తడి, పొడి చెత్త వేరుగా ఇవ్వాలని కోరారు. సంక్షేమ పథకాలు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు రానివారు కలెక్టరేట్ హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టు సతీష్, వైస్ చైర్ పర్సన్ జీనత్ పర్వీన్ మున్నా తదితరులు పాల్గొన్నారు.

కుమార్తె పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమంలో సేవా కార్యక్రమం



చురకలు ప్రతినిధి
మంథని, నవంబర్ 18 : తన కూతురు తాటి సహన్వి పుట్టినరోజు సందర్భంగా మంథని సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో రైటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న విజయ కుమార స్వామి బుధవారం గోదావరిఖనిలోని అమ్మ పరివార్ ఆశ్రమంలో సేవా కార్యక్రమం నిర్వహించారు.చలికాలం దృష్ట్యా ఆశ్రమంలోని వారికి రగ్గులను అందించడంతో పాటు, మధ్యాహ్నం భోజనాలు పెట్టారు.గత రెండు నెలల క్రితం తన కొడుకు తాటి సాయి వర్ధన్ పుట్టినరోజు సందర్భంగా ఐదు నిరుపేద కుటుంబాలకు 9 రకాల నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు.ఇటీవల సామాజిక అంశాలపై రీల్స్ ద్వారా యువతలో చైతన్యం కలిగిస్తూ విజయ కుమార స్వామి తనదైన గుర్తింపు పొందుతున్నారు. సోషల్ మీడియా వేదికగా యువతను మేల్కొలిపే సందేశాలు అందిస్తున్న ఆయన, మాటలకే పరిమితం కాకుండా చేతల్లోనూ సామాజిక బాధ్యతను చూపిస్తూ సేవా మార్గంలో ముందడుగు వేయడం పలువురి ప్రశంసలు అందుకుంటోంది.తన పిల్లల పుట్టినరోజులను సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఆదర్శనీయమని పలువురు అభినందించారు.

ఆలయ పునర్నిర్మాణ పనులను...

మొదటి పేజీ తరువాయి....
పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. 2027 గోదావరి పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. పుష్కర ఘాట్ల నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, రహదారులు, రాకపోకలు, ఇతర మౌలిక వసతులను సమగ్రంగా ఏర్పాటు చేయాలని సూచించారు. పుష్కరాల సమయంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఘాట్ల వద్ద అవసరమైన సౌకర్యాలు, భద్రతా చర్యలను ముందుగానే ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, ఆలయ పునర్నిర్మాణం, పుష్కర ఘాట్లు, రహదారులు, హెలిప్యాడ్‌లతో పాటు అన్ని ఏర్పాట్లను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ పి. మధుసూదన్, మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, ఇరిగేషన్ అధికారులు ఆర్ అండ్ బి అధికారులు, ఎంపీడీవో, తహసీల్దార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి

పకడ్బందీ ఏర్పాట్లు

మొదటి పేజీ తరువాయి...
వెల్లడించారు. జిల్లాలోని ఆయా మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో విడతల వారీగా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి అర్హీదారుల నుంచి రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ వివరాలు తీసుకుంటారని స్పష్టం చేశారు. బీమా చేయించేవారు నామిని వారి వివరాలు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఒకరు లేదా అంతకంటే ఎక్కువ నామినీలు కూడా ఉండవచ్చని వెల్లడించారు. దరఖాస్తు ఫారంలో సంతకం చేయాలని సూచించారు.మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో అధికారులు, సిబ్బంది ప్రత్యేక శిబిరాల వద్ద టెంట్లు, కుర్చీలు, బీమా వివరాల ప్లెక్సీలు, తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వివరాల నమోదు కోసం కంప్యూటర్లు, ఇతర యంత్రాలు, సిబ్బంది హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. మొత్తం ప్రక్రియలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శిబిరాలను ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి వీర భద్రయ్య, జిల్లా ప్రణాళిక అధికారి సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, ఈడీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధు లబ్ధిదారులకు.. కొత్త పథకాల తిప్పలు

మొదటి పేజీ తరువాయి...
దళిత మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెన్షన్ల ఎంపిక సభలకు హాజరవుతున్న వారికి నిరాశే ఎదురవుతోంది. దీనిపై స్థానిక అధికారులను సంప్రదించగా, దళిత బంధు లబ్ధిదారుల జాబితాను ప్రస్తుతానికి 'హోల్డ్'లో (పెండింగ్‌లో) ఉంచామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేస్తున్నారు.
మళ్లీ ఎన్నాళ్లు వేచి చూడాలి?
చాలా కాలం తర్వాత ప్రభుత్వం కొత్త పెన్షన్ల ఎంపిక ప్రక్రియను చేపట్టిందని, ఇప్పుడు అవకాశం కోల్పోతే మళ్లీ కొత్త జాబితా ఎప్పుడు తయారు చేస్తారో తెలియదని బాధితులు వాపోతున్నారు. పెన్షన్ల ఎంపిక నిరంతర ప్రక్రియగా ఉంటే ఐదేళ్ల గడువు ముగిశాకనైనా తమకు న్యాయం జరిగేదని, కానీ ఏళ్ల తరబడి వేచి చూడాల్సి రావడం వల్ల అర్హులైన తమకు అన్యాయం జరుగుతోందని అంటున్నారు. ప్రభుత్వం తమ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకుని న్యాయం చేయాలని కోరుతున్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

మొదటి పేజీ తరువాయి...
పాటు వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుం దన్నారు. ఉన్నత చదువుల్లో ఉన్న అవకాశాలు, భవిష్యత్తులో మంచి కెరీర్ ను ఎంచుకోవడానికి అవసరమైన మార్గదర్శకత్వంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయా లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, కౌన్సిలర్లు జంబర్తి గంగ లక్ష్మీ, దూమాల రాజ్ కుమార్, పంబాల సుజాత, రాముకుమార్, సీనియర్ నాయకులు రేపల్లె హరికృష్ణ, వ్యక్తిత్వ వికాస నిపుణులు సంఘనభట్ల దివాకర్, పలువురు నాయకులు, ప్రజాప్రతి నిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు సంఘం నిధులు రాబందుల పాలు

చురకలు, విలేఖరి, వెల్గటూర్, నవంబర్ 18. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో నిధులు దుర్వినియోగం జరిగినట్లు జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గండ్ర శ్రీకాంత్ రావు ఆరోపిస్తున్నారు.

బిఆర్ఎస్ తీరుపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం

చురకలు ప్రతినిధి కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను చింపి చెత్తబుట్టలో వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, బి.ఆర్.ఎస్ 10 సంవత్సరాల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఎంతవరకు అమలు పరిచారో శ్వేతా పత్రం విడుదల చేయాలని జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి తాజ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్, బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోతు శ్రావణ్ నాయక్ అన్నారు.జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏం డి తాజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు మాత్రమే అవుతుంది, అయినా కూడా మేనిఫెస్టో లోని వాటిని ఒక్కొక్కటిగా అమలు పరుస్తున్నామనీ,గత మీ బి.ఆర్.ఎస్ పాలనలో సంవత్సరానికి లక్ష ఉద్యోగాలు ఇస్తామని ఒక్క ఉద్యోగం అయిన ఇచ్చినారా? కాంగ్రెస్ నిరుద్యోగ భృతి 3000 రూపాయలు ఇస్తామంటే, మీరు 3016 రూపాయలు ఇస్తామని చెప్పి ఒక్కరికైనా ఇచ్చారా, మీ పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన దాఖలాలు ఉంటే చూపించండి. మౌలానా అబుల్ కలాం ఆజాద్ యూనివర్సిటీ తెస్తామని డ్యామ్ వద్ద తూతూ మంత్రంగా భూమి పూజ చేసి చేతులు దులుపుకున్నారు. మిగులు బడ్జెట్ గా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని 10 సంవత్సరాల కాలంలో అప్పుల మయంగా చేశారని అన్నారు.కొరివి అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. నిన్నటి రోజు గంగుల కమలాకర్ మరియు వారి బి.ఆర్.ఎస్ బృందం కాంగ్రెస్ మేనిఫెస్టోను చింపి చెత్తబుట్టలో పారేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము. బి. ఆర్. ఎస్, వారిని ఆత్మవిమర్శన చేసుకోవాలని, గత పది సంవత్సరాల కాలంలో మీరు చేసిన నీచ, నిరంకుశ పాలను చూసి ప్రజలు మీకు పాలన చేత కాదని, మిమ్మల్ని చెత్తబుట్టలో వేశారని అన్నారు. కేవలం మూడు సంవత్సరాలలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను చూసి ఓర్వలేక పోతున్నారు. ఇంత అక్కస్సు ఎందుకు మీకు. అయ్యా జీవన్ రెడ్డి గారు కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులు పొంది, ఇప్పుడు బి. ఆర్. ఎస్, పార్టీలో చేరి కాంగ్రెస్ పార్టీని విమర్శించడం మీకు సభబా, ఆనాడు ఇదే మేనిఫెస్టో రూపొందించే టైములో మీరు కూడా ఉండి సలహాలు ఇచ్చినారు కదా? ఇది న్యాయమా మీకు? ఒక్క కరీంనగర్ లోనే కాదు తెలంగాణ మొత్తంలో కూడా బి. ఆర్. ఎస్ పార్టీ ఖతం అయ్యిందని అన్నారు.పులి ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని మిగులు బడ్జెట్తో మీకు అప్పజెప్పితే, దోచుకొని అప్పుల మయంగా చేసిన ఘనత బి.ఆర్.,ఎస్ పార్టీది కాదా? కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన నుండి 16 లక్షల రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది, ప్రభుత్వం ఏర్పడిన 90 రోజుల్లో 30 వేల ఉద్యోగాలు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తా



చురకలు విలేకరి, జగిత్యాల,నవంబర్ 18 : 35వ వార్డులోని అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని జగిత్యాల మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ జీనత్ పర్వీన్ మున్నా అన్నారు. బుధవారం వార్డుకు చెందిన పలువురు లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న చేయూత పెన్షన్లు మంజూరు కాగా లబ్ధిదారులకు ప్రొసిడింగ్ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డుకు చెందిన అర్హులైన లబ్ధిదారులకుప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో ముందుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు అధికారి సాగర్ నాయక్,వార్డు నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

రేజంగ్లా అమరవీరులకు ఘన నివాళులు



చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం నవంబర్ (18) : దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన 114 మంది యాదవ అహిర్ జవాన్లకు బుధవారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఘనంగా నివాళులర్పించారు. అఖిల భారత యాదవ మహాసభ జగిత్యాల జిల్లా యువజన అధ్యక్షుడు రెబ్బటి రాజశేఖర్ యాదవ్ పాఠశాలలో అమరవీరుల చిత్ర పటాలకు పూలమాల వేసి వీర జవాన్ల త్యాగాలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ.. రేజంగ్లా యుద్ధంలో అహిర్ జవాన్లు చూపిన ధైర్యసాహసాలు, దేశభక్తి చిరస్మరణీయమన్నారు. వారి వీరగాథను భావితరాలకు తెలియజేసేలా స్మారక మ్యూజియం ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వం వెంటనే అహిర్ రెజిమెంట్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో విధ్యర్థులు పాల్గొన్నారు.

రీ సర్వే పనులను పకడ్బందీగా నిర్వహించాలి

-జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ ఎస్. ప్రసూనాంబ



చురకలు ప్రతినిధి, జగిత్యాల,నవంబర్ 18 : భూముల రీ సర్వే పనులను పకడ్బందీగా నిర్వహించాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ ఎస్. ప్రసూనాంబ అధికారులను ఆదేశించారు. సారంగాపూర్ మండలంలోని పోతారం, బీర్ పూర్ మండలంలోని సిరిపురం రాయికల్ మండలం ఆలూర్, వీరాపూర్ గ్రామాల్లో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ ఎస్. ప్రసూనాంబ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కొనసాగుతున్న రీ సర్వే పనుల పురోగతిని, సర్వే నిర్వహిస్తున్న విధానాన్ని, భూ రికార్డుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే ప్రక్రియలో ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వే ప్రక్రియను చేపట్టాలని, భూముల హద్దులు, విస్తీర్ణం తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. సర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రీ సర్వే ద్వారా భూ రికార్డుల్లో ఖచ్చితత్వం ఉండేలా చూడాలని, నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు జ సూచించారు. ఈ కార్యక్రమంలో సారంగాపూర్, బీర్ పూర్, రాయికల్ మండల తహసీల్దార్లు, సంబంధిత అధికారులు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి బీమా.. రూ.5 లక్షల బీమా

-నేటి నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు
-18 నుంచి 59 ఏళ్లలోపు వారికి అవకాశం



చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం నవంబర్ (18) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కార్యక్రమం గురువారం నవంబర్ 19నుండి జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రారంభం కానుంది. ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ. 5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించనున్నారు. ఇందుకోసం మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నమోదు ప్రక్రియ చేపట్టనున్నట్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయ అధికారులు తెలిపారు.

18 నుంచి 59 ఏళ్లలోపు వారికి అవకాశం..

కుటుంబానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న కుటుంబ పెద్ద వయస్సు 18 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉండాలి. కుటుంబ పెద్ద పేరుతో బీమా నమోదు చేసుకోవచ్చు. ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది కుటుంబ సభ్యులను నామినీలుగా పేర్కొనే అవకాశం ఉంది. ఒకరి కంటే ఎక్కువ మందిని నామినీలుగా నమోదు చేసినప్పుడు వారికి కేటాయించే బీమా వాటాల మొత్తం 100 శాతంగా ఉండేలా చూసుకోవాలి.

కావాల్సిన ధ్రువపత్రాలు..

బీమా నమోదు చేసుకునే వ్యక్తి ఆధార్ కార్డు,ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్, నామినీల ఆధార్ కార్డు వివరాలు, వారి మొబైల్ నంబర్లు సమర్పించాల్సి ఉంటుంది. రేషన్ కార్డు ఉన్నవారు దాని వివరాలను అందించాలి.అయితే రేషన్ కార్డు లేని వారు కూడా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు స్పష్టం చేశారు.

59 ఏళ్ల దాటిన కుటుంబ పెద్దలకు ప్రత్యామ్నాయ అవకాశం..

కుటుంబ పెద్ద వయస్సు 59 సంవత్సరాలు దాటినట్లయితే, అదే కుటుంబంలో 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అర్హత ఉన్న మరో సభ్యుడు బీమా కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్ కార్డులో పూర్తి పుట్టిన తేదీ నమోదు కాకుండా కేవలం పుట్టిన సంవత్సరం మాత్రమే ఉన్న సందర్భంలో, ఆధార్‌లో పేర్కొన్న సంవత్సరాన్ని ఆధారంగా తీసుకొని జూలై 1వ తేదీని ప్రామాణిక పుట్టిన తేదీగా పరిగణిస్తారు.

గ్రామ పంచాయతీల్లో నమోదు..

మండలంలోని అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. అవసరమైన ఆధార్, మొబైల్ తదితర వివరాలతో సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి నమోదు చేసుకోవాలని కోరారు. కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించే ఈ పథకంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన వారందరూ నమోదు చేసుకోవాలి.

ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలి

సిహెచ్ గణేష్ - ఎంపిడిఓ ఇబ్రహీంపట్నం

ప్రభుత్వం అందిస్తున్న రూ. 5 లక్షల జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలి. నవంబర్ 19నుంచి గ్రామ పంచాయతీల్లో ప్రారంభమయ్యే బిమానమోదు కార్యక్రమం.అవసరమైన ధ్రువపత్రాలతో వివరాలు నమోదు చేసుకోవాలి. అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా భరోసా కల్పించేలా చర్యలు తీసుకుంటాం.



సీఎం, మంత్రి "అడ్లూరి"లకు పాలాభిషేకం

-"బుగ్గారం"కు సహకార సంఘం మంజూరు పై రైతుల హర్షం
-రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
-బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సాగౌడ్



చురకలు విలేకరి,జగిత్యాల, నవంబర్ 18 : రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వంపనిచేస్తుందని జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగునూరి నర్సాగౌడ్ అన్నారు.బుగ్గారం మండల రైతుల చిరకాల కోరిక నెరవేరిందని, బుగ్గారంకు ప్రత్యేక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్రాజా) మంజూరు కావడంతో మండల వ్యాప్తంగా రైతులు, కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి,రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ల చిత్రపటాలకు నాయకులు గురువారం బుగ్గారం చౌరస్తాలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగునూరి నర్సాగౌడ్ మాట్లాడుతూ...బుగ్గారం రైతుల చిరకాల కోరిక అయిన సొంత సహకార సంఘం ఏర్పాటు కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇన్నాళ్లు ఇతర సంఘాలపై ఆధారపడిన మన రైతులకు ఇక సొంత సంఘం ద్వారా పంట రుణాలు, ఎరువులు, విత్తనాలు నేరుగా అందుతాయని తెలిపారు.దీనికి సహకరించిన ముఖ్యమంత్రి శరేవంత్ రెడ్డికి,సంక్షేమ. శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు మండల రైతులు,నాయకుల ధన్యవాదాలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు.రైతు సంక్షేమమే ధ్యేయంగా ఈ ప్రభుత్వం పనిచేస్తోందని భవిష్యత్తులో కూడా రైతులకు అండగా ఉంటామని నర్సాగౌడ్ స్పష్టం చేశారు.బుగ్గారం మండల అభివృద్ధికి మంత్రి సహకారంతో మరిన్ని నిధులు తీసుకొస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో బుగ్గారం సర్పంచ్ నక్క రాజవ్వ రాజయ్య, శేఖల్ల సర్పంచ్ పర్సా రమేష్, ఉప సర్పంచులు జంగ లావణ్య శ్రీనివాస్, నార్ల బుచ్చయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు కోడిమ్యాల రాజన్న, నక్క గంగాధర్, మండల నాయకులు రెంటం శ్రీధర్,నంది తిరుపతి,బండారి మహేష్, దాసర్తి పోసన్న, కేలేటి పోసరాజు, గడ్డం నారాయణ, రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వెల్గటూర్ కోటిలింగాల మధ్య ఫోర్ లైన్స్ రహదారికి 29 కోట్లు

-సులభతరం కానున్న పుష్కరభక్తుల రాకపోకలు



చురకలు, విలేఖరి వెల్గటూర్, నవంబర్ 18 : జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంనుండి కోటిలింగాల కోటేశ్వరస్వామి పుణ్యక్షేత్రం గోదావరి తీరంకు రాబోయే పుష్కరాల యాత్రికు ల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఫోర్ లైన్స్ రహదారి నిర్మాణానికి ఆర్ అండ్ బి శాఖ ద్వారా 29 కోట్ల నిధులుమంజూరిఅయ్యాయి. దీనితో రహదారి నిర్మాణానికి సంబంధిత శాఖ ఇంజనీరింగ్ అధికారులు బుధవారం సర్వే నిర్వహించారు.టెండర్ ప్రక్రి య పూర్తయ్యి శాఖపరమైన అనుమతులు రాగానే వెంటనే పనులు చేపట్టి పుష్కరాల వరకు పూర్తిచేయనున్నట్లు ఆర్ అండ్ బిఈఈ,తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్గటూర్, కోటిలింగాల సర్పంచులు,డి ఈ ఈ, ఎ ఈ ఈ తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



చురకలు విలేఖరి,హుజురాబాద్, నవంబర్, 18 : హుజురాబాద్ క్లబ్ ఎన్నికల్లో భారీ విజయం సాధించిన క్లబ్ కార్యదర్శి కట్కూరి మల్లారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ కేసిరెడ్డి నర్సింహారెడ్డి, గడ్డం ధర్మారెడ్డి లకు తెలంగాణ కమర్షియల్, ట్యాక్సెస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ బుధవారం సాయంత్రం స్థానిక క్లబ్‌లో సన్మానం చేశారు. గత 35 ఏళ్ళుగా హుజురాబాద్‌లో పాత్రికేయ వృత్తి లో రాణించిన ఈ ముగ్గురు జర్నలిస్టులు హుజురాబాద్ క్లబ్‌లో హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో భారీ విజయం సాధించడం హర్షణీయమని అన్నారు.

చేనేత కార్మికుల పింఛన్ల మంజూరులో జగిత్యాలకు అన్యాయం



చురకలు విలేకరి, జగిత్యాల, నవంబర్ 18 : చేనేత కార్మికుల పింఛన్ల మంజూరులో జగిత్యాల జిల్లాకు అన్యాయం జరగకూడదని పొట్టవత్తిని సతీష్ పేర్కొన్నారు. జిల్లాలో 2,300 మందికి పైగా చేనేత కార్మికులు పింఛన్లకు దరఖాస్తు చేసుకోగా కేవలం 100మందికే మంజూరయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.మిగిలిన దరఖాస్తులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి.అర్హులెంతమంది ఉన్నారనే విషయంపై ప్రభుత్వం,అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవితాంతం మగ్గం ముందు కష్టపడిన చేనేత కార్మికులు వృద్ధాప్యంలో కనీస ఆర్థిక భరోసా కోసం ఎదురుచూడాల్సి రావడం బాధాకరమన్నారు. పింఛన్ అనేది కేవలం ఆర్థిక సహాయం కాదని, గౌరవప్రద జీవనానికి ఆధారమన్నారు. మంజూరైన, తిరస్కరించిన, పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని, అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి పింఛన్ మంజూరు చేయాలని, అవసరమైతే అదనపు కోటా కేటాయించాలని కోరారు. సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంబంధిత మంత్రులు, జిల్లా కలెక్టర్ పరిశీలించి న్యాయం చేయాలని, లేని పక్షంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

పెన్షన్ రాని ప్రతి ఒక్కరి గొంతుకగా నిలుస్తాం



చురకలు విలేకరి, జగిత్యాల, నవంబర్ 18 : పెన్షన్ సమస్యలపై త్వరలో జగిత్యాల జిల్లాలో మహా రిలే దీక్షలు చేపట్టనున్నట్లు జిల్లా దివ్యాంగుల సంఘ నాయకులు లంకదాసరి శ్రీనివాస్, అస్గర్ మహమ్మద్ ఖాన్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ పెన్షన్ రాని ప్రతి ఒక్కరి గొంతుకగా నిలుస్తామని, ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తామని పేర్కొన్నారు. ఎలక్షన్ కమిషన్ సాక్షిగా దివ్యాంగులకు ఇచ్చిన హామీలను,రూ. 6000 పెన్షన్ హామీని ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్లను వెంటనే మంజూరు చేయాలని,ట్రాక్టర్, డీసీఎం ఉన్నాయనే కారణంతో పేదల పెన్షన్లు నిలిపివేయవద్దని,వికలాంగుల పెన్షన్ నిబంధనల్లో మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు.అర్హులైన వారందరికీ జనాభా ప్రతిపదికనలో పెన్షన్లు అందించాలని,నూతన లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

సీనియర్ సిటిజెన్లు మనోనిబ్బరం కలిగి ఉండాలి



జగిత్యాల నవంబర్ 18 : సీనియర్ సిటిజెన్లు మనో నిబ్బరం కలిగి ఉండాలని లంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ అన్నారు. బుధవారం అసోసియేషన్ కార్యాలయంలో వృద్దుల్లో ఆత్మ హత్యల నివారణ- పిల్లల బా ధ్యత అనే అంశం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పేద వృద్ధులకు అసోసియేషన్ తరపున హరి అశోక్ కుమార్ చేతుల మీదుగా శీతాకాలం దృష్ట్యా నిరుపేద వృద్ధులకు బ్లాంకెట్లు, స్వేట్లర్లు అందజేశారు. అనంతరం హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ వృద్ధులకు పలు సమస్యల్లో అవగాహన కల్పించారు. వృద్ధులు ఎక్కడ ఆత్మహత్యలు చేసుకున్నా పోలీసులు విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలన్నారు. కని పెంచిన వృద్ధ తల్లి దండ్రులను హింసలకు గురి చేస్తు ఆస్తులను బలవంతంగా కొడుకులు తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నా పోషించక, ఇండ్ల నుంచి గెంటి వేయడం, వంతుల వారీగా పోషిస్తామనడం వృద్ధాశ్రమంలో చేర్పించడం వంటి విషయాల్లో ఆర్డీవో లకు,పోలీస్ అధికారులకు, తమ అసోసియేషన్ కు ఫిర్యాదు చేయాలన్నారు.తల్లి దండ్రుల ను పోషించక నిరాధరణకు గురి చేస్తే ఆర్డీవో ఆరు మాసా ల వరకు జైలు శిక్ష విధించే వీలుందని, ఆస్తులను బలవంతంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటే తిరిగి తల్లి దండ్రుల పేరిట కలెక్టర్ మార్చే వీలు చట్టం లో ఉందని వివరించారు. ఈ కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరి శెట్టి విశ్వ నాథమ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. సి. హన్మంత్ రెడ్డి, పూసాల అశోక్ రావు, జిల్లా కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు సత్యనారాయణ, కరుణ, ఎం. డి. యాకూబ్ టీబీసీ జేఏ సీ జిల్లా అధ్యక్షురాలు జలజ,వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

-చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 18 : ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర సీఎం ఏ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు.ఈ నేపథ్యంలో మల్యాల మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన నూతన సామాజిక భద్రతా పింఛన్ల మంజూరు ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొని నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులైన పేదలకు సామాజిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో కొత్తగా పింఛన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు.వృద్ధులు, వితంతువులు,ఒంటరి మహిళలు, దివ్యాంగులు,కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులకు పింఛన్లు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక చేయూత అందుతోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రజాప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం నూతన సామాజిక భద్రతా పింఛన్ల కోసం అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారిని గుర్తించి పింఛన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. నూతన పింఛన్ల ద్వారా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు తదితర వర్గాలకు ప్రతి నెలా ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇంకా అర్హత ఉండి పింఛన్లు పొందని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,వారి దరఖాస్తులను పరిశీలించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్హులైన వారు తమ వివరాలు, అవసరమైన పత్రాలను సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన వారికి పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డిఓ మధుసూదన్, డి ఆర్ డి ఓ రఘువరన్,ఎంపీడీవో, తహసిల్దార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పారిశ్రామిక,వైద్య రంగాలపై అవగాహన



చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం , నవంబర్ (18) : విద్యార్థులకు పాఠ్యాంశాల పరిజ్ఞానంతో పాటు క్షేత్రస్థాయిలో వివిధ రంగాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆధ్వర్యంలో 9వ తరగతి విద్యార్థులు బుధవారం ఇండస్ట్రియల్ టూర్‌కు బయలుదేరారు. ఈ పర్యటన ద్వారా విద్యార్థులకు పారిశ్రామిక రంగం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, వైద్య రంగానికి సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించనున్నారు. కామారెడ్డి లోని గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీని, చెరకు నుంచి చక్కెర తయారు చేసే విధానం, పరిశ్రమలో వినియోగించే యంత్రాలు, వివిధ ఉత్పత్తి దశలు,పరిశ్రమ నిర్వహణ తీరును ప్రత్యక్షంగా పరిశీలించి తెలుసుకోనున్నారు. వ్యవసాయానికి పరిశ్రమలకు మధ్య ఉన్న సంబంధం, రైతులు పండించే చెరకు పంటకు చక్కెర పరిశ్రమల ద్వారా లభించే ప్రాధాన్యత గురించి అవగాహన పొందనున్నారు.అనంతరం నిజామాబాద్‌లోని క్యాన్సర్ ఆసుపత్రిని సందర్శించనున్నారు. అక్కడ క్యాన్సర్ వ్యాధికి సంబంధించిన వైద్య పరీక్షలు, వ్యాధి నిర్ధారణ పద్ధతులు, చికిత్స విధానాలు, రోగులకు అందించే వైద్య సేవల గురించి తెలుసుకోనున్నారు. ముఖ్యంగా ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల పట్ల అప్రమత్తత, ముందస్తు పరీక్షల ప్రాముఖ్యత వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన,పాఠశాలల్లో నేర్చుకున్న విషయాలను ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా విద్యార్థుల్లో కొత్త విషయాలు తెలుసుకోవాలనే ఆసక్తి పెరుగుతుందని, భవిష్యత్తులో ఉన్నత విద్య, వృత్తి ఎంపికల విషయంలో ఇలాంటి పర్యటనలు ఎంతగానో దోహదపడతాయని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. వివిధ రంగాల్లో పనిచేసే విధానాలను దగ్గరగా పరిశీలించడం వల్ల విద్యార్థులకు ఆచరణాత్మక పరిజ్ఞానం పెరగడంతో పాటు పరిశీలనా దృక్పథం, ప్రశ్నించే తత్వం, సామాజిక బాధ్యత వంటి లక్షణాలు అలవడతాయి.ఈ ఇండస్ట్రియల్ టూర్ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎంలు చిన్నయ్య, నర్సయ్య, ప్రేమ్ కుమార్, రాజు, హెల్త్ ఇన్‌స్ట్రక్టర్ రాము, అగ్రికల్చర్ ఇన్‌స్ట్రక్టర్ రాజ్యలక్ష్మి విద్యర్థులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయండి

-అంబేద్కర్ యువజన సంఘం నాయకుల పిలుపు



చురకలు ప్రతినిధి మంథని, నవంబర్ 18 : అనాదిగా అణిచివేతకు అవమానాలకు గురవుతున్న అట్టడుగు వర్గాల కు అండగా వున్న ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22 వ తేదీన పెద్దపల్లి లో రంగంపల్లి జిల్లా కోర్టు దగ్గరలో ఆర్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్న అంబేద్కర్ యువజన సంఘం 50 వసంతాల చారిత్రాత్మక స్వర్ణోత్సవ మహాసభకు మంథని డివిజన్ లోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పెద్దపల్లి కి తరలి రావాలని బుధవారం మంథని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న దళిత బహుజన ఉద్యమాల స్ఫూర్తి ప్రధాత భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ గారి ఆలోచన విధానాన్ని ముందుకు తీసుకోవాలన్న సంకల్పంతో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీ మరియు ప్రభుత్వ ఉద్యోగులు విద్యావంతులు అందరూ ఏకమై ఆంధ్ర ప్రదేశ్ అంబేద్కర్ యువజన సంఘాన్ని స్థాపించడం జరిగిందని 1977లో ఈ సంఘం స్థాపించడం జరిగిందని అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీలు దళిత అనగారిన వర్గాలపై జరిగిన కిరాతకమైన అనుమానుష సంఘటనలు దాడులు ఊచకోతకు నిరసనగా దళిత వర్గాల అణగారిన వర్గాల హక్కులను కాపాడడం కోసం భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ గారి ఆలోచన విధానమే పీడిత ప్రజలకు విముక్తి మార్గమని నమ్మి 1977 వ సంవత్సరంలో అంబేద్కర్ జన సంఘం జరిగిందని గత 50 సంవత్సరాల పాటు అంబేద్కర్ యువజన సంఘం పోరాటాలు ఎంతోమందికి ఆదర్శంగా నిలిచిందని దళిత అనగారిన వర్గాల హక్కుల సాధన ముందు వరుసలో ఉన్నదని 2014 సంవత్సరంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ యువజన సంఘం భారత దేశవ్యాప్తం గా దళిత బహుజన వర్గాల కు అండగా నిలవాలనే లక్ష్యంతో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘంగా పేరు మార్చుకొని అనేక రాష్ట్రాలకు విస్తరించిందని దళిత బహుజన వర్గాలకు సమాజంలో జరుగుతున్న అణిచివేతకు అవమానాలకు కేవలం ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మాత్రమే అండగా ఉంటుందని బాబాసాహెబ్ అంబేద్కర్ గారి ఆలోచన విధానం మేరకే సంఘం పనిచేస్తుందని అన్నారు.మంథని డివిజన్లోని మంథని ముత్తారం రామగిరి కమాన్ పూర్ మండలాలకు చెందిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాలు ఈనెల 22వ తేదీ ఆదివారం రోజున ఉదయం 10 గంటలకు పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని రంగంపల్లి ఆర్ఆర్ గార్డెన్స్ లో జరిగే ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం 50 వసంతాల స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మంథని ఇంచార్జ్ కాసిపేట పోషం, కన్నూరి బాపు జాతీయ కార్యదర్శి రిటైర్డ్ ఫారెస్ట్ రేంజ్ అధికారి బి రాజయ్య, జిల్లా అధ్యక్షులు మంథనిలక్ష్మణ్ వేల్పుల రాజు బూడిద తిరుపతి మంథని రాకేష్ వడ్లూరు ఈశ్వర చారి కాసిపేట వెంకటస్వామి కాసిపేట సాగర్ గడ్డం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


పెన్షన్లతో నిస్సహాయులకు భరోసా

-పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి



చురకలు విలేఖరి,తిమ్మాపూర్ నవంబర్ 18 : నిస్సహాయులైన నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించి, వారి జీవితాలకు అండగా నిలవాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేయూత పింఛన్లను అందిస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.బుధవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో నగరపాలక సంస్థ 7, 8వ డివిజన్ల పరిధిలోని సదాశివపల్లి, అల్గునూరు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను అన్ని విధాలుగా ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పింఛన్లు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు.ఈ పథకాల ద్వారా రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందని తెలిపారు.ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ వారి సొంతింటి కలను ప్రభుత్వం సాకారం చేస్తోందన్నారు. ముఖ్యంగా గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలకు ఇళ్ల మంజూరులో అధిక ప్రాధాన్యత నిస్తున్నామని, గుడిసెలు లేని తెలంగాణ రాష్ట్రాన్ని నిర్మించడమే రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గురువారం సిద్ధిపేటలో జరిగే బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ పథకం ద్వారా అందించే రూ.5లక్షల జీవిత బీమా పేద కుటుంబాలకు ఆర్థికభరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, మానకొండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, 8వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల నందిని, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి మల్లేశం గౌడ్, 7వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కంది చిన్న అశోక్ రెడ్డి, పోరండ్ల పీఏసీఎస్ చైర్మన్ గోపు తిరుపతిరెడ్డి, పార్టీ నాయకులు ఆకుల ఉదయ్, గోపు మల్లారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, కంది లక్ష్మీనారాయణ రెడ్డి, ఏనుగు చుక్కారెడ్డితౌర్తి అరవింద్, బుర్ర శ్రీకాంత్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

హుజురాబాద్ 5వ వార్డులో పెన్షన్ల పంపిణీ



చురకలు ప్రతినిధి హుజురాబాద్ నవంబర్ 18 : హుజురాబాద్ పట్టణంలోని 5వ వార్డులో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. 5వ వార్డు కౌన్సిలర్ సొల్లు సునీత ఆధ్వర్యంలో మునిసిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని వికలాంగులు, వితంతువులు గీత కార్మికులకు ప్రభుత్వం అంజూరు చేసిన పెన్షన్ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ రొంటాల సుహాసిని గారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్ నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి బాటలో నడుస్తుందని తెలిపారు. అర్హులైన అందరికీ పింఛన్లు అందజేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని అన్నారు. హుజురాబాద్ అభివృద్ధికి మునిసిపల్ కౌన్సిల్ నిరంతరం కృషి చేస్తుందని ఆమె వివరించారు. సుహాసినితోపాటు కౌన్సిలర్ సొల్లు సునీత పింఛన్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రొంటాల మొగిలి, వార్డు ఆఫీసర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలిపాక శంకర్ పాల్గొన్నారు.

22న తెలంగాణ ఉద్యమకారుల ఛలో మేడారం



చురకలు ప్రతినిధి మంథని, నవంబర్ 18 : తెలంగాణ ఉద్యమకారుల ఛలో మేడారం కార్యక్రమం ఈ నెల 22వ తేదీ ఆదివారం నాడు మంథని నుండి జరుగుతుందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు మంథని విజయ్ కుమార్ ఒక ప్రకటన లో తెలిపారు.మంథని నియోజకవర్గం లోని తెలంగాణ ఉద్యమ కారులందరూ హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా జంపన్న వాగు నుండి సమ్మక్క సారలక్క గద్దెల వరకు ర్యాలీగా వెళ్లడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించడం జరుగుతుందని, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ అధ్యక్షతన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో టియుఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం దేవేందర్, లక్ష్మీనారాయణ, కమిటీలో చర్చించడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డా. బాసు శ్రీనివాస్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు శర్మ దేవేందర్, మంథని నియోజకవర్గ యువజన విభాగం కన్వీనర్ మంథని సమన్వయకర్త, మంథని మండల ప్రధాన కార్యదర్శి వాడి చంపయ్య, సీనియర్ ఉద్యమకారులు కుడుముల లక్ష్మీనారాయణ, మంథని సంపత్ లు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి

-రైతులు ధాన్యం శుభ్రం చేసి సిద్ధం చేయాలి
-17 తేమ శాతం ఉండేలా చూసుకోవాలి
-అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



చురకలు ప్రతినిధి రాజన్న సిరిసిల్ల, నవంబర్ 18 : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తెలిపారు.ధాన్యం సేకరణ కోసం జిల్లాలో ఇప్పటివరకు ఐకేపీ ఆధ్వర్యంలో 113, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 108, మెప్మా ఆధ్వర్యంలో 6 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. ధాన్యం సేకరణ కోసం ఇప్పటికే 26 రైస్ మిల్లులు, ప్రభుత్వ ప్రత్యామ్నాయ గోదాములు సిద్ధంగా పెట్టామని వెల్లడించారు.రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం శుభ్రం చేసి.. 17 శాతం తేమ ఉండేలా చూసుకోవాలని సూచించారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పిలుపు నిచ్చారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



చురకలు విలేఖరి చిగురుమామిడి,నవంబర్ 18 : బహుజన సాహిత్య అకాడమీ ద్వారా ఇటీవల న్యూఢిల్లీలో "అంబేద్కర్ నేషనల్ అవార్డు" అందుకున్న యువ నాయకుడు బోయిని బాబును సిద్దిపేట ఏసిపి (సిసిఎస్) గడ్డం సదన్ కుమార్ తదితరులు అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు.ఇదే సందర్భాన్ని పురస్కరించుకుని చిగురుమామి మండలం నవాబుపేటలో ప్రజా ప్రతినిధులు, పార్టీల నాయకులు, దళిత సంఘాల నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ భావజాల వ్యాప్తి కొరకు బోయిని బాబు దశాబ్దకాలంగా విశేష కృషి చేస్తున్నాడని అన్నారు. జాతీయస్థాయిలో ఆయన సేవలను గుర్తించి అంబేద్కర్ అవార్డు ప్రధానం చేయడం అందరికీ గర్వకారణమని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు రాణా ప్రతాప్ సింగ్, గొట్టి రఘుబాబు, వివిధ పార్టీల నాయకులు ఠాకూర్ నరేందర్ సింగ్, బోయిని ఆది మల్లయ్య, బోయిని సతీష్, బోయిని విజయ్ కుమార్, బోయిని మనోజ్, బోయిని వంశీకృష్ణ, బోయిని సురేష్, శంకర్, ఉమేష్, రఘు, పందిపెల్లి మహేష్, సంపత్, రాజయ్య, లింగయ్య, ఎనగందుల సంజీవ్ ఆంజనేయులు, నితిన్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఆసరా పింఛన్లు మంజూరు చేయాలి



చురకలు విలేఖరి వీణవంక నవంబర్ 18 : వీణవంక మండలంలో అర్హులైన పేదలకు ఆసరా పింఛన్లు మంజూరు చేయకుండా ఇబ్బందులకు గురిచేయడం సరికాదని జిల్లా ఉపాధ్యక్షులు నరసింహ రాజు,మండల అధ్యక్షులు బత్తిని నరేష్ గౌడ్, నాయకులతో కలిసిఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆన్‌లైన్‌లో అర్హులుగా కనిపిస్తున్నప్పటికీ పింఛన్లు అందకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.భూమి ఉందని,కుటుంబంలో డాక్టర్లు ఉన్నారని తదితర కారణాలతో పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు వస్తున్న ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని, అనర్హతకు సంబంధించిన కారణాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని,బాధ్యులైన అధికారులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమం లో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ గొడుగు వినోద్ కుమార్,దాట్ల వీరాస్వామి, సందీప్ మండలం ప్రధానకార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి,హరికృష్ణ,కొమురయ్య,మారం తిరుపతి రెడ్డి,బొబ్బల శ్రీనివాస్ రెడ్డి,నాగరాజు,రమణ రెడ్డి,రాజు,బ్రహ్మ రెడ్డి, రామూర్తి, అజిత్,పొన్నాల అనిల్,మధునయ్య,బుర్ర సదానందం, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న మహిళకు అండగా నిలిచిన జర్నలిస్ట్

-రక్తదానం చేసి ప్రాణదాతగా మారిన దీప్తి కుమార్



చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట నవంబర్ 18 : ఎల్లారెడ్డిపేట: ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడమే మానవత్వానికి నిజమైన నిదర్శనమని చాటుతూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన జర్నలిస్ట్ కులేరి దీప్తి కుమార్ రక్తదానం చేసి తన ఉదారతను చాటుకున్నారు.ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన లక్ష్మి సిరిసిల్ల ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఆమెకు అత్యవసరంగా రక్తం అవసరమైందని సమాచారం అందడంతో స్పందించిన జర్నలిస్ట్ కులేరి దీప్తి కుమార్ బుధవారం ఆసుపత్రికి చేరుకుని రక్తదానం చేశారు.తనకు పరిచయం ఉన్నవారైనా, లేకపోయినా ఆపదలో ఉన్న సమయంలో ఒక మనిషికి సహాయం చేయాలనే మానవతా దృక్పథంతో ఆయన ముందుకు వచ్చారు. రక్తం అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా బాధితురాలికి అండగా నిలిచారు.రక్తదానం అంటే కేవలం రక్తాన్ని ఇవ్వడం మాత్రమే కాదు.. ఒకరి ప్రాణాలను కాపాడేందుకు ఆశను అందించడం. ఒక్కరి రక్తదానం మరొకరి కుటుంబంలో ఆనందాన్ని నిలబెట్టగలదు. అత్యవసర సమయాల్లో రక్తదానం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడుతున్నారు. వృత్తిపరంగా జర్నలిస్టుగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూనే, ఆపదలో ఉన్న వారికి తనవంతు సహాయం అందించడం ద్వారా కులేరి దీప్తి కుమార్ పలువురికి ఆదర్శంగా నిలిచారు.

ఉచిత వ్యాధి నివారణ టీకాలు

చురకలు విలేకరి, మెట్ పల్లి, నవంబర్ 18 : మెట్ పల్లి మండలం ఆత్మకూరు గ్రామంలో బుధవారం పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు ఉచిత పోచమ్మ (షీప్ పాక్స్) వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పశువైద్యాధికారి డా. వి. అశ్విని మాట్లాడుతూ.. షీప్ పాక్స్ వ్యాధి వైరస్ ద్వారా వ్యాపిస్తుందని, వ్యాధి సోకిన జీవాలకు జ్వరం, శరీరంపై బొబ్బలు ఏర్పడి మేత సరిగా తినలేక నీరసించి మృత్యువాత పడే ప్రమాదం ఉందని వ్యాధి నివారణకు మూడు నెలల వయస్సు దాటిన గొర్రెలు, మేకలన్నింటికీ తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్యాల రాజారాం, ఉపసర్పంచ్ కసాడి తిరుపతి, పశువైద్య సిబ్బంది దిలీప్, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

కన్నులపండుగగా రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం

-రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న ప్రముఖులు
-రేణుక ఎల్లమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పించిన గౌడ సంఘం అధ్యక్షులు గంట దేవా గౌడ్



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 18 : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం లోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా,కన్నులపండుగగా జరిగింది ,భక్తుల కోలాహలం మధ్యశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవం కనువిందు చేసింది,అంగరంగ వైభవంగా జరిగింది ,స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో గౌడ సంఘం అధ్యక్షులు గంట దేవాగౌడ్, పట్టు వస్త్రాలను ముత్యాల తలంబ్రాలను సమర్పించారు, మాంగల్య ధారణ. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారికి కన్నులపండుగగా మాంగల్య ధారణ జరిపించారు.అనంతరం పోతరాజులు ఎల్లమ్మతల్లికి పెద్దపట్నం వేసి బోనాలను సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.శివసత్తుల పూనకాలతో ముగింపు పలికారు, గౌడ సంఘానికి చెందిన యువకులు సిద్దుల వేషాలతో పోతరాజులు శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లిపరుష రాముని వేషాలతో ఆలయం చుట్టూరా తిరుగుతూ దప్పు చప్పుల మధ్య మేకను గావు పట్టే కార్యక్రమాన్ని చేపట్టి భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు,ఈ అద్భుత ఘట్టాన్ని వీక్షించేందుకు ఎల్లారెడ్డిపేట మండలంతో పాటు వివిధమండలాలకు చెందిన భక్తులు గౌడుల బంధుమిత్రులు భారీగా తరలివచ్చారు.శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లిని రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డబోయినా గోపి బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య ఏఎంసి చైర్మన్ మేడిపల్లి దేవానందం వైస్ చైర్మన్ నందికిచెను సర్పంచ్ల ఫోరము మండల అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూడిది రాజేందర్ మాజీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి ఏఎంసీ మాజీ వైస్ ప్రెసిడెంట్ గుండాడి రాంరెడ్డి,సర్పంచులు ఎలగందుల నరసింహులు,బాపురెడ్డి సిర్రం నాగరాజు యాదవ్,కొండ రమేష్ గౌడు,ఉప సర్పంచ్ బంధారపు బాల్‌రెడ్డి, నాయకులు గిరిధర్ రెడ్డి బండారి బాల్‌రెడ్డి మర్రి శ్రీనివాస్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వరుస కృష్ణ హరి ఏఎంసీ మాజీ అధ్యక్షులు అందే సుభాష్ గుల్లపల్లి నరసింహారెడ్డి,పట్టణ అధ్యక్షులు ఎడ్ల సందీప్ బిజెపి నాయకులు సందుపట్ల లక్ష్మారెడ్డి వార్డు సభ్యులు ఏఏంసి డైరెక్టర్లు, కాంగ్రెస్ బిజెపి బి ఆర్ ఎస్ పార్టీలకు చెందిన నాయకులు దర్శించుకున్నారు.శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి సిద్ధోగం సందర్భంగా గౌడ సంఘం మండల అధ్యక్షులు గంటా కార్తీక్‌గౌడ్ పట్టణ అధ్యక్షులు దేవా గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పందిల్ల లింగం గౌడు, పందిళ్ళ పరిశ్రమల గౌడు అంజాగౌడ్,గంట అంజా గౌడు వెంకటేష్ గౌడ్ పందిల్ల శ్రీనివాస్ గౌడ్,పుల్లయ్య గారి తిరుపతి గౌడు చింతకింది బాలరాజు గౌడు బాలకృష్ణ గౌడ్ సీనియర్ జర్నలిస్టు చింతకింది శ్రీనివాస్ గౌడ్ లతో పాటు పలువురు గౌడులు బంధుమిత్రులకు పెద్ద ఎత్తున విందు భోజనాలు ఏర్పాటు చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

-బీజేపీ డిమాండ్
-హుజురాబాద్ తహసిల్దార్ కార్యాలయం ఎదుట బిజెపి నిరసన



చురకలు ప్రతినిధి హుజూరాబాద్, నవంబర్ 18 : హుజూరాబాద్ మండల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి,రైతులు పండించిన ధాన్యాన్ని ఎలాంటి జాప్యం లేకుండా కొనుగోలు చేయాలని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) డిమాండ్ చేసింది. బీజేపీ స్థానిక పట్టణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి ఎమ్మార్వో నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు మాట్లాడుతూ.. రైతులు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తుఫాన్ ప్రభావం నేపథ్యంలో ధాన్యం తడిసిపోకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్నీ బ్యాగులు, తూకం యంత్రాలు, ఇతర మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచి, రైతులు రోజుల తరబడి వేచి ఉండే పరిస్థితిని నివారించాలని అన్నారు.రైతులకు అన్యాయం జరిగితే బీజేపీ చూస్తూ ఊరుకోదని, సమస్యలు పరిష్కరించకపోతే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు, పట్టణ మాజీ అధ్యక్షులు గంగిశెట్టి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి తిప్పబత్తిని రాజు, ఉపాధ్యక్షులు యాళ్ల సంజీవరెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షులు ఎర్ర శ్రీధర్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు కొలిపాక వెంకటేష్, పట్టణ కార్యదర్శులు గుర్రం సంతోష్, కొడిమ్యాల పవన్, బోడిగ రాధ, కొలుగూరి అనిల్, కోశాధికారి క్యాస వెంకటేష్, సీనియర్ నాయకులు నరాల రాజశేఖర్, యాంసాని శశిధర్, అంకతి వాసు, బోరగాల సారయ్య, కురిమిళ్ల శ్రీధర్, బూత్ అధ్యక్షులు డోరి అయిలయ్య, ఆవుల సదయ్య, చతర్ సింగ్, పోతోజు కిరణ్, పర్ధం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ ప్రొసీడింగ్స్ అందజేసిన కార్పొరేటర్ ప్రవీణ్ కుమార్

-డివిజన్‌లో అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్లు అందిస్తాం: కార్పొరేటర్ ప్రవీణ్ కుమార్



చురకలు ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 18 : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధి లోని 50వ డివిజన్‌లో నూతనంగా మంజూరైన 'చేయూత' పెన్షన్ల ప్రొసీడింగ్ కాపీలను స్థానిక కార్పొరేటర్ బోయిన్ పల్లి ప్రవీణ్ కుమార్ లబ్ధిదారులకు అందజేశారు.బుధవారం డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో భాగంగా ఆయన లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి, మరికొందరిని కలిసి ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్ మంజూరు పత్రాలను స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బోయిన్ పల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. పేద,బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పెన్షన్లు ఆర్థికంగా ఎంతో దోహదపడతా యన్నారు.డివిజన్ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందేలా కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పెన్షన్ల మంజూరు విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హత ఉండి ఇంకా పింఛన్ రాని వారు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.తమకు పెన్షన్ మంజూరు చేయించి,ప్రొసీడింగ్ పత్రాలను అందజేసినందుకు లబ్ధిదారులు కార్పొరేటర్ బోయిన్ పల్లి ప్రవీణ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు,డివిజన్ ముఖ్య కార్యకర్తలు, కాలనీవాసులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

బోర్నపల్లి గణేశ ప్రతిష్టలో

మాజీ ఎమ్మెల్యే సతీష్ బాబు దంపతుల పూజలు

చురకలు ప్రతినిధి హుజూరాబాద్ నవంబర్ 18 : హుజూరాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని బోర్నపల్లి గ్రామంలో బుధవారం ప్రారంభమైన శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయ ప్రతిష్టా కార్యక్రమంలో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ డా. షమిత దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛారణ మధ్య మంగళ వాయిద్యాల నడుమ సతీష్ బాబు దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సతీష్ బాబు మాట్లాడుతూ.. బోర్నపల్లిలో శ్రీ లక్ష్మీ గణపతి ఆలయాన్ని నిర్మించడం, ఆలయ ప్రతిష్టకు గ్రామస్తులు పూనుకోవడం శుభ పరిణామమని ప్రశంసించారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా కార్యక్రమం సవ్యంగా సాగాలని ఆకాంక్షించారు. ఇలాంటి పవిత్ర, ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నందుకు తమకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. బోర్నపల్లి తమకు సొంత గ్రామం లాంటిదని, ఇక్కడి భక్తుల, ప్రజల ప్రేమ అనురాగాలు మరువలేనివని, తన కుటుంబంతో ఎంతో అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. తన తండ్రి కెప్టెన్ లక్ష్మీకాంతరావు బోట్నపల్లి నుండి గతంలో ఎంపీటీసీగా సేవలందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి



అంగరిక సంపత్ రావు, కుసుంబా సంపత్, చక్రధర్, కమల్ తదితరులు పాల్గొన్నారు.

"గణేశ"నామస్మరణతో మార్మోగిపోయిన బోర్నపల్లి

-అంగరంగ వైభవంగా ప్రారంభమైన శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయ ప్రతిష్ఠ

చురకలు ప్రతినిధి హుజూరాబాద్ నవంబర్ 18 : హుజూరాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని బోర్నపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయ ప్రతిష్ట కార్యక్రమాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా కార్యక్రమాలను నిర్వహించారు. మూడు రోజులపాటు ప్రతిష్ట కార్యక్రమాలు జరగనున్న విషయం తెలిసిందే. కర్ణాటకలోని రాయచూర్ సిద్ధి హనుమాన్ దేవాలయం ధర్మకర్త పవన్



కుమార్ ఆచార్య ఆధ్వర్యంలో వేద పండితులు మంత్ర పతనం చేశారు. స్థానిక వేద పండితులు పందిళ్ళ భాస్కర్ శర్మ, విజేందర్ శర్మ, చంద్రశేఖర్ శర్మ, కాట్రపల్లి విశ్వనాథ శర్మ తదితరులు వేద పఠనం చేశారు. మొదటి రోజైన బుధవారం ఉదయం గణపతి పూజ, సంకల్పం, పుణ్యాహవచనం, అంకురార్పణం, గోపూజ, యాగశాల ప్రవేశం, నవగ్రహ హోమం, వాస్తు హోమం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం సప్తాహవచనం, పంచసూక్త పఠనం, గణపతి అథర్వశీర్ష హోమం, జలాధివాసం, హారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి అంగరిక రాజేంద్రప్రసాద్, సభ్యులు క్యాస చక్రధర్, మసాడి రవీందర్రావు, చందమల్ల బాబు, శనిగరపు నరేందర్, కుసుంబా సంపత్ రావు, క్యాస కమల్ కుమార్ తదితరుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పురుషుక్రవారాల్లోనూ ప్రతిష్ట పూజా కార్యక్రమాలు కొనసాగనున్నాయి. మున్సిపల్ చైర్మన్ ఆర్. సుహాసిని, వ్యాపారవేత్త మున్సిపల్ కౌన్సిలర్ వద్దినేని రవీందర్ రావు, కొండ గణేష్, ములుగు పూర్ణచందర్, విష్ణుదాస్ గోపాల్ రావు,గ్రామస్తులు పాల్గొన్నారు.

బొగ్గు నాణ్యతలో ఆర్జీ-త్రీ ఏరియాకు ప్రథమ బహుమతి



చురకలు పెద్దపల్లి జిల్లా ప్రతి కమాన్‌పూర్ నవంబర్ 18 : సింగరేణి సంస్థలో ఈ 2025--26 ఆర్థిక సంవత్సరానికి సింగరేణి వ్యాప్తంగా బొగ్గు నాణ్యతలో అగ్రస్థానం సింగరేణి సంస్థలో 2025--26 ఆర్థిక సంవత్సరానికి గాను బొగ్గు నాణ్యతలో రామగుండం 3 ఏరియా ప్రథమ స్థానం సాధించి ప్రత్యేక గుర్తింపు పొందింది.నవంబర్ 12 నుంచి 18 వరకు సింగరేణి వ్యాప్తంగా నిర్వహించిన బొగ్గు నాణ్యత వారోత్సవాలు--2026 ముగింపు కార్యక్రమం బుధవారం ఆర్.జి-1 ఏరియా లోని ఇల్లందు క్లబ్‌లో జరిగింది.ఈ సందర్భంగా డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కొప్పుల వెంకటేశ్వర్లు చేతుల మీదుగా రామగుండం 3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ ప్రథమ బహుమతిని అందుకున్నారు.బొగ్గు నాణ్యత ప్రమాణాలను మెరుగుపరచడంలో ఆర్జీ-3 ఏరియా సాధించిన ఈ విజయం సమిష్టి కృషికి నిదర్శనంగా నిలిచింది.

ధర్మపురి జూనియర్ సివిల్ జడ్జిగా పావని



చురకలు విలేకరి, జగిత్యాల, నవంబర్ 18 : ధర్మపురి జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు చేపట్టిన పావని ని బుధవారం ధర్మపురి బార్ అసోసియేషన్ న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.బార్ అసోసియేషన్ అధ్యక్షులు బందెల రమేష్, ప్రధాన కార్యదర్శి రామడుగు రాజేష్ బుధవారం పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మామిడాల శ్రీకాంత్ కుమార్, ఏజీపీ ఇమ్మడి శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు గడ్డం సత్యనారాయణ రెడ్డి, రౌతు రాజేష్, ఆల్క వినోద్ కుమార్, గూడ జితేందర్ రెడ్డి, కస్తూరి శరత్ కుమార్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఓసి-2లో ఐఎన్టియుసి ఆధ్వర్యంలో

ఘనంగా గేట్ మీటింగ్

-కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తాం -ఐ ఎన్ టి యు సి నాయకులు

చురకలు (పెద్దపల్లి జిల్లా ప్రతినిధి) కమాన్ పూర్ నవంబర్ 18 : సింగరేణి సంస్థ ఓసి-2లో ఐఎన్టీయూసీ ఆధ్వర్యం లో గేట్ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐ ఎన్ టి యు సి సీనియర్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్లు నరసింహారెడ్డి , ధర్మపురి , ఆర్ జి-3 ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి గారు హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి హక్కులు, సంక్షేమం, పని ప్రదేశాల్లో నెలకొన్న ఇబ్బందులపై మాట్లాడారు. కార్మికుల న్యాయమైన



సమస్యల పరిష్కారం కోసం ఐ ఎన్ టి యు సి ఎల్లప్పుడూ కార్మికులకు అండగా ఉంటుందని, వారి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారంపై యాజమాన్యం స్పందించకపోతే, కార్మికులందరూ ఐక్యంగా ఈనెల 25న ఐ ఎన్ టి యు సి ఆధ్వర్యంలో సీఎండీ కార్యాలయాన్ని ముట్టడించడం జరుగుతుందని తెలిపారు. కార్మికుల హక్కుల సాధన కోసం జరిగే ఈ పోరాటంలో ప్రతి కార్మికుడు భాగస్వామి కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో పిట్ సెక్రటరీ రామిండ్ల మనోహర్, సెంట్రల్ సెక్రటరీలు ఎల్లంకి రామారావు, ఉయ్యాల కుమార్, భిక్ష నాయక్, మడ్డి రాజ్ కుమార్, కే.ఎన్. చారి, ఓడేటి చంద్రశేఖర్, బండ్ల సమ్మయ్య, గిరవేణి కొమరన్న, అంజన్న, వెంకన్న యాదవ్, అంజి, రాళ్లబండి రవీందర్, కోటి, ప్రభాకర్ తదితర యూనియన్ నాయకులు, కార్యకర్తలు మరియు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో

పేరెంట్స్-టీచర్స్ సమావేశం

చురకలు ప్రతినిధి హుజూరాబాద్ నవంబర్ 18 : ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు హుజూరాబాద్‌లోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రులు అధ్యాపకుల సమావేశం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలు ప్రభుత్వ కళాశాలలో చదవడం అదృష్టంగా భావిస్తున్నామని సంతోషం వ్యక్తం చేశారు. కళాశాల విద్యా ప్రమాణాలు పరిస్థితులపై విద్యార్థులు తమ అనుభవాలను వివరించడంతో పాటు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం అధ్యాపకులు మాట్లాడుతూ విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా పలు సూచనలు చేస్తూ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ప్రిన్సిపాల్ సుగుణ

తల్లిదండ్రులు అధ్యాపకుల



సమావేశంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుగుణ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఉచిత యూనిఫామ్, షూస్, నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు, బ్యాడ్జీలు, స్కాలర్‌షిప్‌లను అందిస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజనం కూడా అందించనున్నట్లు వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గత విద్యా సంవత్సరంలో కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల పేర్లను ప్రిన్సిపాల్ ప్రకటించగా, తల్లిదండ్రులు అభినందించారు.ఈ సమావేశంలో అధ్యాపకులు ప్రసాద్, తులసీదాస్, విజయేందర్ రెడ్డి, వాసు, మురళీమోహన్, మల్లారెడ్డి, రాజేశం, రేణుక, రాజశేఖర్, సురేష్, శైలజ, రామ్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

అమలుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి

-అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా

-దరఖాస్తుల స్వీకరణలో పారదర్శకత, అధికారుల మధ్య సమన్వయం ఉండాలి

-ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు

జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్



చురకలు ప్రతినిధి జగిత్యాల, నవంబర్ 18 : ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలును సమర్థవంతం గా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మండలస్థాయి అధికారు లైన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మున్సిపల్ కమిషనర్లతో జూమ్ మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 19న సిద్దిపేటలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా పథకాన్ని ప్రారంభించ నున్న నేపథ్యంలో,జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.అర్హులైన ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించే ఈ పథకంపై ప్రజాప్రతినిధులకు, గ్రామస్థాయి ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగి కుటుంబానికి ఆదాయం సమకూర్చే అర్హులైన సభ్యుల వివరాలను ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేయాలి. ఇందుకోసం రేషన్ కార్డు నంబర్ ఆధారంగా కుటుంబ వివరాలను పరిశీలించి,ఆధార్ కార్డు ద్వారా వయస్సు అర్హతను ధ్రువీకరించాలని సూచించారు.కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది అర్హులైన సభ్యులు ఉంటే వారి వివరాలను కూడా నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మైనర్ల విషయంలో సంరక్షకుడి వివరాలను నమోదు చేయాలని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ కోసం ఏర్పాటు చేసే ఫెసిలిటేషన్ కేంద్రాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లు, ఇంటర్నెట్ తదితర అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, దరఖాస్తుదారుడి తో వివరాలను సరిచూసిన అనంతరం మాత్రమే ప్రత్యేక పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. నామినీ వివరాలు, వారితో ఉన్న సంబంధం, మొబైల్ నంబర్ తదితర వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు.దరఖాస్తు నమోదు పూర్తయిన తర్వాత ప్రివ్యూ ద్వారా మరోసారి పరిశీలించి, ఏవైనా తప్పులు ఉంటే సరిచేసి సేవ్ చేయాలన్నారు. అనంతరం దరఖాస్తు పిడిఎఫ్ ప్రతిని దరఖాస్తుదారుడికి అందజేసి, అప్లికేషన్ నంబర్ కేటాయించడంతో పాటు రసీదు ఇవ్వాలని తెలిపారు. దరఖాస్తుదారుడి సంతకాన్ని తీసుకొని నిర్ణీత పరిమితిలో పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.మండలస్థాయి అధికారులు , తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మున్సిపల్ కమిషనర్లు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.ఉన్నతాధికారుల నుంచి ఎప్పటికప్పుడు వెలువడే సూచనలు,ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ పథకం అమలును పకడ్బందీగా నిర్వహించాలన్నారు.అర్హులైన కుటుంబాల వివరాల నమోదులో కొత్త వ్యక్తులను చేర్చడం,మరణించిన వారి పేర్లను తొలగించడం వంటి మార్పులకు అవకాశం లేకుండా, అనుమతించిన సమాచార సవరణలకే పరిమితం కావాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. ప్రసూనాంబ, డీఆర్డీఓ, సీపీఓ, జడ్పీ సీఈఓ, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఇతర జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు

అల్ఫోర్స్ స్కూల్ విద్యార్థిని ఎంపిక

-రాష్ట్రస్థాయి పోటీలలో రజత పతకం కైవసం



చురకలు ప్రతినిధి కరీంనగర్ నవంబర్,18 : క్రీడలు విద్యార్థులకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తాయని, ఒత్తిడి నుండి ఉపశమనం పొందడానికి చాలా ఉపకరిస్తాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ ద నెక్ట్‌లో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థిని జాతీయస్థాయి అథ్లెటిక్స్ - పరుగు పందెం పోటీలకు ఎంపికైన సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందించడమే కాకుండా నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయులచే నిత్యం శిక్షణ ఇప్పిస్తూ పోటీలలో విజయం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వారు చెప్పారు. విద్యార్థులకు క్రీడలు అన్ని విధాలుగా లాభాలు చేకూర్చడమే కాకుండా వారిని వివిధ కార్యకలాపా లను చేపట్టడానికి హుషారుగా నిలుపుతుందని వారు అభిప్రాయపడ్డారు .ఈ క్రమంలో ఇటీవల కాలంలో హన్మకొండలోని జెఎన్ స్టేడియంలో 70వ SGF రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పరుగు పందెంలో అండర్ - 14 విభాగంలో7th class, నూరేన్ రజత పతకం కైవసం చేసుకోవడమే కాకుండా జాతీయ స్థాయి పోటీలకు సైతం ఎంపికవ్వడం చాలా గొప్ప విషయమని వారు చెప్పారు. (జాతీయ స్థాయి పోటీల తేదీ మరియు వేదిక ఇంకా ఖరారు కావాల్సి ఉంది) ఎంపికైన విద్యార్థినికి పుష్పగుచ్ఛాన్ని అందజేసి జాతీయస్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభ చాటాలని మరియు విజయాన్ని కైవసం చేసుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతే

పోలీస్ శాఖ ప్రథమ కర్తవ్యం

-కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



చురకలు ప్రతినిధి కరీంనగర్, నవంబర్, 18 : కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం బుధవారం జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీస్ అధికారులతో వారాంతపు నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల పరిష్కారంపై సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.కొత్త నేర చట్టాల అమలు: చట్టాల నిబంధనలను అవగాహన చేసుకొని, కేసుల నమోదు, దర్యాప్తును పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.ఈ-పెట్టీ కేసులు: చిన్నపాటి నేరాలు, న్యూసెన్స్, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పెండింగ్ కేసుల పరిష్కారం ం చార్జ్ షీట్ల దాఖలు: దర్యాప్తు పూర్తయిన పెండింగ్ కేసులలో వెంటనే చార్జ్ షీట్లు దాఖలు చేయాలని, పెండింగ్ ఖ× (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసుల సంఖ్యను తగ్గించడమే లక్ష్యంగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ బాధితులకు సత్వర న్యాయం అందేలా విధులు నిర్వహించాలని సీపీ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఏసీపీలు శ్రీనివాస్,వెంకటస్వామి, విజయకుమార్, సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కనిపిస్తున్న మద్యం సీసాలు..

కనిపించని అధికారుల పర్యవేక్షణ



-ఫారెస్ట్ అధికారుల నివాసం చెంతే అసాంఘిక కార్యకలాపాల ఆనవాళ్లు

చురకలు విలేకరి, మల్లాపూర్, నవంబర్ 18 : మల్లాపూర్ మండల కేంద్రంలోని ఫారెస్ట్ ఫారెస్ట్ నివాసం పరిసరాలు వివాదాస్పదంగా మారుతు న్నాయి.ఫారెస్ట్ క్వార్టర్స్ గదుల చుట్టూ మద్యం సీసాలు, సిగరెట్ ప్యాకెట్లు దర్శనమిస్తుండటం చర్చనీయాంశంగా మారుతోంది. అటవీ శాఖ ప్రభుత్వ ఉద్యోగుల నివాస సమీపంలో ఇలాంటి పరిస్థితులు నెలకొనడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్వార్టర్స్ పరిసరాల్లో మద్యం సీసాలు,సిగరెట్ ప్యాకెట్లు పేరుకుపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నివాసం నిర్వహణ, పరిసరాల పరిశు భ్రతపై కనీస పర్యవేక్షణ లేకపోవడంతో పరిస్థితి ఇలా తయారైందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ఫారెస్ట్ క్వార్టర్స్ పరిసరాల్లో అసలు ఏం జరుగుతోంది, అక్కడి పరిస్థితులపై అటవీశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని, క్వార్టర్స్ పరిసరాలను పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పదవి విరమణ పొందిన ఉద్యోగుల

సమస్యలను వెంటనే పరిష్కరించండి

-మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్



చురకలు విలేఖరి,హుజూరాబాద్, నవంబర్, 18 : పదవి విరమణ పొందిన ఉద్యోగుల అనేక రకాల సమస్యలు మరియు పెండింగ్ బిల్లులు అన్ని రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెండింగ్లో ఉన్నాయి గతంలో పదవి విరమణ పొందిన ఒక నెల లోపు అన్ని రకాల పెన్షనర్లకు సంబంధించిన బిల్లులు మంజూరయ్యేది కానీ ఇప్పుడు మెడికల్ బిల్లులు జిపిఎఫ్ మరియు ఇతర అనేక రకాల బిల్లులు ప్రభుత్వం వద్దనే పెండింగ్లో ఉన్నాయి అని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఆవేదన వ్యక్తం చేశారు.పదవి విరమణ రిటైర్మెంట్ అయిన తర్వాత కూడా కొన్ని సంవత్స రాలు గడుస్తున్నప్పటికీ పెన్షనర్లకు సంబంధించిన అనేక రకాల బిల్లులు ప్రభుత్వం వద్ద పెండింగ్లోనే ఉన్నాయి. ఇంకా ఎప్పుడు మంజూరవు తాయని ఎదురుచూస్తున్నారు ఈ ప్రభుత్వంలో పెన్షనర్లకు మరి ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటవ తారీఖు జీతాలు పెన్షనర్లకు పెన్షన్ జీతం పడటం జరుగుతుంది కానీ ప్రభుత్వం దగ్గర డిఏలు మరియు రెండవ పిఆర్సి ఇప్పటివరకు పెండింగ్లోనే ఉన్నాయి కనుక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు సంబంధించిన అనేక రకాల బిల్లులు మంజూరి కావాలంటే ప్రతి నెల రెండు వేల కోట్లు బడ్జెట్ను నిధులను వెంటనే మంజూరి చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక ప్రిన్సిపాల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తాన్య చొరవ తీసుకొని వెంటనే పదవి విరమణ పొందిన పెన్షనర్లకు సంబంధించిన అనేక రకాల అన్ని బిల్లులను వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల గజిటెడ్ ఉపాధ్యా యులు కార్మికులు మరియు పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.